క్లుప్తంగా

నేడు, రేపు మంచినీటి సరఫరా నిలిపివేత

రాజంపేట : ఈనెల 24, 25 తేదీల్లో రాజంపేట పట్టణానికి సరఫరా అయ్యే అన్నమయ్య మంచినీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు కమిషనరు జనార్ధన్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. బోయనపల్లెలో రోడ్డు పక్కన ఉన్న పైపు లైను మరమ్మతులు కారణంగా సరఫరా నిలిపివేయాల్సి వచ్చిందన్నారు. పట్టణవాసులు సహకరించాలన్నారు. ప్రధానంగా ఉస్మాన్‌నగర్, కొలిమివీధి, ఎగువగడ్డ, మన్నూరు, సాయినగర్, లక్ష్మినగర్, మన్నూరు అరుంధతివాడ, బలిజపల్లె హరిజనవాడ, గంగిరెడ్డిపాలెం, సరస్వతీపురం, ఆర్‌ఎస్‌రోడ్డు, మహబూబ్‌నగర్, రాజీవ్ నగర్, సుద్దగుంతలు, నూనివారిపల్లెరోడ్డు, రామ్‌నగర్, బాలాజీనగర్, ఆకుల వీధి, కనకమ్మ సందు, గడ్డివీధి, భవానీనగర్, ముకందరగడ్డ, బంద్రాళ్లవీధి, నూనివారిపల్లె, హైదర్‌నగర్, అమ్మవారిశాల వీధి, ఈడిగపాళెం, ఎర్రబల్లి, విద్యుత్‌నగర్, బలిజపల్లె, ఆర్‌అండ్‌బీ బంగ్లా ప్రాంతాల్లో నీటిసరఫరా ఉండదని వెల్లడించారు.

పెద్దయ్యస్వామికి ప్రత్యేక పూజలు

చిన్నమండెం : మండల పరిధిలోని దేవగుడిపల్లె గ్రామంలోని శ్రీ మాలే పెద్దయ్యస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాఘ మాసం సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. ఈ సందర్భంగా స్వామివారికి పలు అభిషేకాలు, పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు విద్యార్థిని

రాజంపేట టౌన్ : ప్రభుత్వ జూనియర్ కళాశాలలో బైపీసీ ద్వితీయ సంవత్సరం చదువుతున్న షేక్ నాజనీన్ కౌసర్ జాతీయ స్థాయి ఫెన్సింగ్ పోటీలకు ఎంపికైనట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ కల్లూరి రామిరెడ్డి సోమవారం ఇక్కడి విలేకరులకు తెలిపారు. ఇటీవల నంద్యాలలో జరిగిన రాష్ట్రస్థాయి పోటీల్లో నాజనీన్ కౌసర్ ఫెన్సింగ్ సాబెర్ విభాగంలో విశేష ప్రతిభ కనబరచడంతో క్రీడా అధికారులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశారన్నారు. కళాశాల పీడీ మురళీకృష్ణారెడ్డి, ఎకనామిక్స్ అధ్యాపకుడు, ఫెన్సింగ్ అసోసియేషన్ ప్రతినిధి రామాంజనేయులు, బోటని అధ్యాపకుడు మల్లికార్జున క్రీడాకారుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు.

జగనన్న కాలనీలో మౌలిక వసతులు కల్పిస్తాం

చిన్నమండెం : జగనన్న కాలనీలో మౌలిక వసతులను కల్పిస్తామని ఎంపీడీఓ దివ్య పేర్కొన్నారు. ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి, జెడ్పీ మాజీ వైస్ చైర్మన్ దేవనాథరెడ్డిల కృషితో జగనన్న కాలనీకి ట్రాన్స్‌ఫార్మర్, తాగునీటి బోరును సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ట్రాన్స్‌కో ఏఈ కొండయ్యతో కలిసి ఎంపీడీఓ మాట్లాడుతూ జగనన్న కాలనీలో వసతుల కల్పనకు ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందన్నారు. లబ్ధిదారులు త్వరగా ఇండ్లను నిర్మించుకోవాలని సూచించారు. హౌసింగ్ ఏఈ రాజేశ్వరి, ఎంపీటీసీలు రమేష్, ఏజాజ్ అలీఖాన్, సర్పంచ్ నజీర్ అహమ్మద్, జిల్లా విజిలెన్స్ కమిటీ మెంబర్ అంజనప్ప, ఉపసర్పంచ్ సుదర్శన్ బాబు, లైన్‌మెన్ సురేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ల ర్యాలీని జయప్రదం చేయండి

రాయచోటి అర్బన్ : ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి ఆదేశాల మేరకు ఈనెల 26న నిర్వహించే ట్రాక్టర్ల ర్యాలీని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు వంగిమళ్ళ రంగారెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎన్‌జీఓ సభా భవనంలో ఆయన పలు రైతు సంఘాల నేతలతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ స్వామినాథన్ కమిషన్ సూచనల మేరకు ధరల గ్యారంటీ చట్టాన్ని తయారు చేయాలన్నారు. విద్యుత్ బిల్లుల పెంపును వెనక్కు తీసుకోవాలని, వ్యవసాయ మోటర్లకు మీటర్లు బిగించవద్దని, సమగ్ర పంటల బీమాను అమలు చేయాలన్న డిమాండ్‌లతో ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ట్రాక్టర్‌ల ర్యాలీ పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు సాగుతుందన్నారు.

ఆర్.ఉప్పరపల్లెలో వైద్య శిబిరం

పుల్లంపేట : రంగంపల్లి పంచాయతీలోని ఆర్.ఉప్పరపల్లెలో ఉచిత వైద్య శిబిరాన్ని పుల్లంపేట పీహెచ్‌సీ వైద్యులు డా.సానే శేఖర్, డా. మనోజ్ చంద్రల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీజనల్ వ్యాధులపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వారు ప్రజలకు సూచించారు. సీహెచ్‌ఓ రాజా, పీహెచ్‌ఎన్ నాగజ్యోతి, ఏఎన్‌ఎం సరస్వతి, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

స్థలం కేటాయించండి

ఓబులవారిపల్లె : మండల కేంద్రంలో ఇండోర్ బ్యాడ్మింటన్ కోర్టు నిర్మించుకునేందుకు స్థలం కేటాయించాలని సోమవారం తహసీల్దార్ పీర్ మున్నికి మండల కేంద్రంలోని క్రీడాకారులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల కేంద్రంలో దాదాపు యాభైమంది బ్యాడ్మింటన్ క్రీడాకారులు ఉన్నారని మండల వ్యాప్తంగా వంద మందికి పైగా వారి గ్రామాల్లో క్రీడాకారులు ఉన్నారని తెలిపారు. బ్యాడ్మింటన్‌ను క్రీడాకారుల సౌలభ్యం కోసం ప్రభుత్వం స్థలం కేటాయించాలని వారు కోరారు. సురేంద్ర, చెండా శ్రీనివాసులు, ఈపురి మహేంద్ర స్థానిక యువ క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమంతో ప్రజల గుండెల్లో సుస్థిరస్థానం

గుండ్లచెరువులో గడప గడపకు కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి



రాయచోటి టౌన్: విగ్రహ ఆవిష్కరణలో ఎమ్మెల్యే గడికోట, వైఎస్సార్ సీపీ నాయకులు



గాలివీడు: గుండ్లచెరువులో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

గాలివీడు : పేదల సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదర్శ పాలన సాగిస్తూ పేద ప్రజల గుండెలలో సుస్థిరస్థానం సంపాదించుకున్నారని రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం గుండ్లచెరువు సచివాలయ పరిధిలోని బండివాండ్లపల్లె, బురుజుపల్లె, అమ్మగారిపల్లె, వడ్డిపల్లె, పసలవాండ్లపల్లె, హరిజనవాడలలో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పేదల అభ్యున్నతి కోసం నవరత్నాలను అమలు చేస్తున్నారని, దీంతో పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడుతున్నాయన్నారు. ప్రజలు ఉన్నతస్థితికి చేరుకునే రోజులు దగ్గరపడ్డాయని, అందుకు జగనన్నపై మీ ప్రేమను మరింతగా కొనసాగించాలని కోరారు. సంక్షేమ పథకాలు పార్టీలకతీతంగా ప్రతిపక్ష నాయకులు, కార్యకర్తలకు అందించడం జరుగుతోందన్నారు. జగనన్న పాలనలో ప్రజలు మెరుగైన జీవనం సాగిస్తున్నారని వారు తెలియజేశారు. గుండ్లచెరువు గ్రామంలో గడప గడపకు కార్యక్రమంలో ప్రజలు అడుగడుగునా ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డికి నీరాజనాలు పలుకుతూ ఆత్మీయ స్వాగతాలు మధ్య, హారతులతో, చిరునవ్వులతో స్వాగతం పలికారు.

సమస్యలను వెంటనే పరిష్కరించండి

గ్రామాలలో నెలకొన్న చిన్న చిన్న సమస్యలను అధికారులు, నాయకులు సమన్వయంతో వెంటనే పరిష్కరించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులకు ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జిల్లా సుదర్శన్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథరెడ్డి, వైస్ ఎంపీపీ యదుభూషన్ రెడ్డి, ఆవుల నాగభూషణ్ రెడ్డి, సర్పంచ్‌లు ఉమాపతి రెడ్డి, చెన్నకేశవరెడ్డి, చింతంరెడ్డి జానకమ్మ, ఉమా ప్రభాకర్, హనుమాన్ నాయక్, ఎంపీటీసీలు పేరం జనార్ధన్ రెడ్డి, అమానుల్లా, మాజీ ఎంపీపీ బండి చిన్నరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మహనీయుల సేవలు మరవలేనివి

రాయచోటి టౌన్ : మహనీయుల సేవలను దేశం ఎన్నటికీ మరవలేదని వీరిని మన్నన చేసుకోవడం మన అదృష్టంగా భావించాలని జిల్లా వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. సోమవారం రాయచోటి పట్టణంలోని బండ్లపెంట సమీపంలో సామాజిక విప్లవకారుడు జ్యోతిరావు పూలే, మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం విగ్రహాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక అసమానతలపై అలుపెరగని పోరాటం సాగించిన జ్యోతిరావు పూలే జీవితం ప్రపంచానికే ఆదర్శమన్నారు. అణగారిన, అణిచివేతకు గురైన బడుగు, బలహీన వర్గాలకు ఆత్మస్థైర్యం కల్పించి వారి సాధికారికతకు కృషి చేశారని చెప్పారు. పూలే విద్య వివక్ష, పేదరికం, ఆర్థిక సమానత్వం నిర్మూలించడానికి ఎంతగానో కృషి చేశారని చెప్పారు. దేశ శాస్త్ర, సాంకేతిక రంగంతోపాటు రాష్ట్రపతిగా విశేష సేవలందించిన మహనీయుడు డాక్టర్ అబ్దుల్ కలాంని తెలిపారు.

గణతంత్ర దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

రాజంపేట : భారతదేశ గణతంత్ర దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సబ్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ పిలుపునిచ్చారు. సోమవారం సబ్‌కలెక్టరేట్ క్యాంపస్‌లోని అన్నమయ్య సభా భవనంలో గణతంత్ర దినోత్సవం వేడుకలను పురస్కరించుకొని అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు గణతంత్ర దినోత్సవ వేడుకను ఘనంగా జరుపుకోవాలన్నారు. అధికారులు సమన్వయంతో వేడుకలు నిర్వహించాలన్నారు. సమావేశంలో డీఎస్పీ శివభాస్కర్‌రెడ్డి, కమిషనరు జనార్ధన్‌రెడ్డి, డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

వినతులను సకాలంలో పరిష్కరించాలి

స్పందనలో ప్రజల నుంచి వచ్చిన వినతులపై సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని సబ్‌కలెక్టర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. స్పందనలో భాగంగా తన చాంబరులో ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. అనంతరం ఆయన్ను పలు సంఘాల నేతలు సత్కరించారు. రాష్ట్ర ఈడిగ కార్పొరేషన్ డైరక్టరు దాసరి చిదానందగౌడ్, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ దండు గోపి, జబ్బిరెడ్డి వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ నేతలు దాసరి పెంచలయ్య, గోవిందుబాలకృష్ణ, శ్రీనువాసులగౌడ్, కె.నరసింహ, బి.పెంచలయ్య సబ్‌కలెక్టర్‌ను సన్మానించారు. అలాగే సుండుపల్లె, మంగంపేట, కోడూరుకు చెందిన నాయకులు, పలువురు బ్యాంక్ అధికారులు సబ్‌కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

పరిహారం అందించండి

ఓబులవారిపల్లె : కాలుష్య గ్రామాల తరలింపునకు పునావాసం కల్పించేందుకు అన్ని విధాల సహకరించామని వెంటనే పరిహారం ఇప్పించాలని మంగంపేట బెరైటీస్ ఆధారిత ప్రజా సంక్షేమ సంఘం కమిటీ సభ్యులు సోమవారం రాజంపేట సబ్ కలెక్టర్ అహ్మద్‌ఖాన్‌ను కోరారు. ఈమేరకు రాజంపేట సబ్ కలెక్టర్ కార్యాలయంలో కమిటీ సభ్యులు పుష్పగుచ్ఛంతో సబ్ కలెక్టర్‌ను సన్మానించారు.



ఓబులవారిపల్లె: సమస్యలు విన్నవించిన అనంతరం సబ్ కలెక్టర్‌ను సన్మానించిన నాయకులు

సబ్‌కలెక్టర్‌ను కలిసిన వైద్యాధికారుల బృందం

రాజంపేట : రాజంపేట సబ్‌కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌ను ఆదివారం వైద్య ఆరోగ్యశాఖ వైద్యాధికారులు బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఆయనను శాలువా కప్పి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఇందులో వైద్య ఆరోగ్యశాఖ నియోజకవర్గ నోడల్ ఆఫీసర్ డా.సానే శేఖర్, పుల్లంపేట వైద్యాధికారి మనోజ్ చంద్ర, ఎంపీహెచ్‌ఓ అండ్ సీహెచ్‌ఓ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు పిల్లి పిచ్చయ్య, ఏపీజీఈఏ అసోసియేషన్ రాజంపేట అధ్యక్షుడు యు.సిద్ధిరామయ్యలు ఉన్నారు. వీరికి ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని, ప్రభుత్వ లక్ష్యాలను అధిగమించేలా విధులు నిర్వర్తించాలని సబ్‌కలెక్టర్ ఆదేశించారు.

నిర్మాణాలు మొదలెట్టని వారికి నోటీసులు

జగనన్న ఇళ్లపై సమీక్షలో మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డి

సిద్దవటం : జగనన్న కాలనీలో ఇంటి పట్టాలను తీసుకొని ఇంత వరకు నిర్మాణ పనులు చేపట్టని లబ్ధిధారులకు నోటీసులు జారీ చేయాలని రెవెన్యూ అధికారులకు మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డి సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం పక్కా గృహాలపై అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొదుపు సంఘాల్లో లబ్ధిదారులు ఇంటి నిర్మాణ పనుల కోసం నగదును తీసుకొని సొంత ప్రయోజనాలకు ఉపయోగించుకున్నటువంటి వారికి నోటీసులు జారీ చేయాలని వెలుగు కార్యాలయం అధికారులకు అదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డీఈ రమణ రెడ్డి, ఇన్‌చార్జి ఎంపీడీఓ పులిరామ్‌సింగ్, వెలుగు ఏపీఎం వెంకటేశ్వర్లు, వ్యవసాయాధికారి రమేష్‌రెడ్డి, ఇన్‌చార్జి హౌసింగ్ ఏఈ చెన్నయ్య, గ్రామ కార్యదర్శులు, వీఆర్‌ఓలు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డి

ఇంటిపన్నులు చెల్లించాలి

అన్ని గ్రామ పంచాయతీలలో ఇంటి పన్నులను ప్రజలు సకాలంలో చెల్లించాలని మండల ప్రత్యేకాధికారి ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని సోమవారం ప్రభాకర్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు.

ఆడపిల్లల చదువు భవిష్యత్తుకు బాట



పెనగలూరు: మాట్లాడుతున్న సూపర్‌వైజర్ సురేఖ



సంబేపల్లె : ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం



చిన్నమండెం: ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

రాయచోటి అర్బన్ : ఆడపిల్లల చదువు భావితరాల భవిష్యత్తుకు బాట అని ఐసీడీఎస్ రాయచోటి మండల సూపర్‌వైజర్‌లు సుగుణ, లక్షుమమ్మ, శివసుబ్బమ్మలు పేర్కొన్నారు. సోమవారం ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో కస్తూరిబా గురుకుల పాఠశాలలో నక్కవాండ్లపల్లె అంగన్‌వాడీ కేంద్రంలో బాలికా దినోత్సవాన్ని నిర్వహించారు. వారు మాట్లాడుతూ 18 సంవత్సరాల లోపు బాలికలకు వివాహం చేయడం నేరమన్నారు. బాల్య వివాహాల నిర్మూలన ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ఎవరైనా బాల్య వివాహాలు చేయాలని చూస్తే వారి సమాచారం చైల్డ్‌హెల్ప్ లైన్ నం.1098కి అందివ్వాలంటూ కోరారు. కుటుంబంలో మగపిల్లలతో సమానంగా ఆడపిల్లలనూ చూడాలన్నారు. తల్లితండ్రుల ప్రోత్సాహంతో అమ్మాయిలు విద్య, ఉద్యోగ, రాజకీయంతో పాటు అన్ని రంగాల్లో విశేషంగా రాణిస్తున్నారంటూ చెప్పారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో పలువురు అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సంబేపల్లెలో..

సంబేపల్లె : ప్రధాన మంత్రి నరేంద్రమోడీ ప్రారంభించిన కార్యక్రమైన బేటి పడావో బేటి బచావో కార్యక్రమంపై స్త్రీ శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో అంగన్‌వాడీలు స్థానిక ఆదర్శ పాఠశాల విద్యార్థులతో సోమవారం ర్యాలీ సోమవారం నిర్వహించారు. కార్యకర్తలు మాట్లాడుతూ బాలికా విద్యకు ప్రభుత్వం పలు పథకాలను రూపొందించి దిగ్విజయంగా అమలు పరుస్తుందన్నారు. అదేసమయంలో బాలికలలను కాపాడుకొనే బాధ్యత ప్రతి ఒక్కరిదన్నారు.

చిన్నమండెంలో..

చిన్నమండెం : మండల కేంద్రంలోని బాలికల జెడ్పీ ఉన్నత పాఠశాలలో స్త్రీ,శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమాన్ని సోమవారం అంగన్వాడీ కార్యకర్తలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి మండల కేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, విద్యార్థులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

లక్కిరెడ్డిపల్లె : బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని లక్కిరెడ్డిపల్లె ఐసీడీఎస్ సీడీపీఓ పద్మావతి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ పద్మావతి మాట్లాడుతూ ఆడపిల్లలు కష్టపడి చదువుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలన్నారు. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, చిన్న వయస్సులో ఆడపిల్లలకు వివాహాలు చేస్తే తల్లిదండ్రులకు శిక్ష పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వరప్రసాద్, సూపర్‌వైజర్లు అరుణకుమారి, తులసమ్మ, దాది చెల్లమ్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆడపిల్లలను ఆదరించాలి

పెనగలూరు : ఆడపిల్లలను ఆదరించాలని అంగన్‌వాడీ కొండూరు సెక్టార్ సూపర్‌వైజర్ సురేఖ రాణి అన్నారు. సోమవారం ఈటమాపురం అంగన్‌వాడీ సెంటర్‌లో భేటీ భచావో భేటీ పడావో కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలో ఆడబిడ్డలను పురిటిలోనే చంపేయడంతో మగవారి సంఖ్య పెరిగి ఆడవారి సంఖ్య తగ్గిందన్నారు. గ్రామాల్లో ఆడ బిడ్డలను ఆదరించాలనే విషయంపై అవగాహన కల్పించాలని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త చంద్రకళ, ఏఎన్‌ఎం శాంతకుమారి, డిజిటల్ అసిస్టెంట్ శిరీషా తదితరులు పాల్గొన్నారు.

అత్యుత్తమ ఫలితాల సాధనకు కృషి

రాజంపేట టౌన్ : ఈ ఏడాది ఏప్రిల్‌లో జరగనున్న టెన్త్ పబ్లిక్ పరీక్షల్లో సమిష్టి కృషితో అత్యుత్తమ ఫలితాలను సాధించేందుకు కృషి చేస్తానని ఎంఈఓ వెంకటేష్‌నాయక్ తెలిపారు. పూర్తి అదనపు బాధ్యతలతో సోమవారం వెంకటేష్‌నాయక్ మండల విద్యాశాఖ అధికారిగా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. టెన్త్ పబ్లిక్ పరీక్షలు సమీపిస్తున్నందున ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకునేందుకు ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. చదువులో వెనకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకొని చదివించి తద్వారా ప్రతి విద్యార్థి ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేస్తామన్నారు. నాడు-నేడు పనులపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. ముమ్మరంగా పాఠశాలలను తనిఖీ చేయనున్నట్లు తెలిపారు. మధ్యాహ్న భోజన పథకంలో వంట ఏజెన్సీ నిర్వాహకులు విధిగా మెనూ అమలు చేయాలన్నారు. ఇదిలావుండగా ఎంఈఓగా బాధ్యతలు చేపట్టిన వెంకటేష్‌నాయక్‌ను, ఇదివరకు ఎంఈఓగా పనిచేసిన కొండూరు రఘునాథరాజును వివిధ పాఠశాలలకు చెందిన హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు సన్మానించారు.

ప్రమాద నివారణకు నిబంధనలు తప్పనిసరి



సిద్దవటం: బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



రాజంపేట: మాట్లాడుతున్న ఎంవీఐ వినోద్‌కుమార్

రాజంపేట : ప్రాణం చాలా విలువైనదని ప్రతి ఒక్క డ్రైవరు గుర్తించుకోవాలని రాజంపేట మోటారు వెహికల్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. రాజంపేట డిపో మేనేజరు రమణయ్యతో కలిసి ఆర్టీసీ డిపోలో డ్రైవర్లు, కార్మికులకు రోడ్డు భద్రతా వారోత్సవాల సందర్భంగా సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అతివేగం ప్రమాదకరమన్నారు. రోడ్డు రవాణా శాఖ నిబంధనలు అనుసరించి బస్సులను నడపాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలను పాటించాలన్నారు. డ్రైవరుపై ఎన్నో ప్రాణాలు ఆధారపడతాయని, అటువంటప్పుడు వాహనం నడిపే విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డిపో గ్యారేజీ కార్మికులు, డ్రైవర్లు, ఎంవీఐ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలి

సిద్దవటం : ద్విచక్ర వాహనదారులు ప్రతి ఒక్కరూ హెల్మెంట్‌ను తప్పనిసరిగా ధరించాలని ఎస్‌ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. ఈ సంధర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఆదేశాలతో 34వ జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్ క్రాస్ రోడ్డు సమీపంలో నుంచి సోమవారం తన సిబ్బంది, ప్రజలతో కలిసి హెల్మెట్ ధరించి బైక్ ర్యాలీ నిర్వహించారు.

రుణాలు మంజూరు చేయాలి

వీరబల్లి : జగనన్న తోడు కింద చిరు వ్యాపారులకు రుణాలు మంజూరు చేయాలని ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి కోరారు. సోమవారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన వీఓఏల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2022-23 సంవత్సరానికిగాను 350 చిరు వ్యాపారులకు బ్యాంకుల ద్వారా ఈ పథకం కింద రూ. 10 వేలు ఇప్పించడం లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. గ్రామ సమాఖ్య పరిధిలో చిరు వ్యాపారులను గుర్తించి దరఖాస్తులను బ్యాంకులలో ఇవ్వాలన్నారు. గ్రామీణ బ్యాంకు మేనేజర్ మాట్లాడుతూ అర్హులందరికీ వెంటనే రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. ఇల్లు మంజూరైన వారికి నిర్మాణానికి అవసరమైన రుణాలను ఇవ్వాలని హౌసింగ్ అధికారి వెంకటేష్ కోరారు.

అప్పరాజుపేటలో జెండా ఉరుసు

పుల్లంపేట : మండల పరిధిలోని అప్పరాజుపేట గ్రామంలో జెండా ఉరుసు కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ జెండా ఉరుసు కార్యక్రమాన్ని ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ప్రతి ఏడాది జనవరి నెల చివరలో నిర్వహిస్తామని ముస్లిం పెద్ద సయ్యద్ ముస్తాక్ తెలియజేశారు.

ఘనంగా వాసవీమాత ఆత్మార్పణ దినోత్సవం

రాజంపేట టౌన్ : పట్టణంలోని అమ్మవారిశాలలో సోమవారం వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆత్మార్పణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భ గుడిలోని అమ్మవారిని గంధంతో అలంకరించారు. అలాగే ఉత్సవమూర్తులను పట్టువస్త్రాలతో, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించి ప్రత్యేక వేదికలపై కొలువుదీర్చారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకుడు సుబ్బరాయుడు నేతృత్వంలో పురోహితులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. పెద్దఎత్తున భక్తులు పాల్గొన్నారు. ఆర్యవైశ్య మహిళలు అమ్మవారికి వడిబియ్యం సాంగ్యాన్ని గర్భగుడి చుట్టూ ఊరేగించి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కన్యపిల్లలకు వడిబియ్యం సాంగ్యం చేశారు. సాయంత్రం కుంకుమార్చన కార్యక్రమాన్ని జరిపారు. మహిళలతో అమ్మవారిశాల కిక్కిరిసిపోయింది.



పూజలందుకుంటున్న కన్యకాపరమేశ్వరీదేవి

దళితుల ఆధీనంలో ఉన్న భూమికి పట్టాలివ్వాలి

సీపీఐ నేతలతో కలిసి కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపిన బాలురెడ్డిపల్లె దళితులు

రాయచోటి అర్బన్ : ఓబులవారిపల్లె మండలం బాలురెడ్డిపల్లె పంచాయతీలో దళితులు సాగు చేసుకుంటున్న భూములను వారికే పట్టాలుగా ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జ్యోతి చిన్నయ్య, విశ్వనాథనాయక్, మండెం సుధీర్ కుమార్‌లు డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ ఓబులవారిపల్లె మండల కార్యదర్శి చింతలపూడి నాగమ్మ ఆధ్వర్యంలో బాలురెడ్డిపల్లె దళితులు తమసాగులో ఉన్న భూములను తమకే పట్టాగా ఇవ్వాలంటూ జిల్లా కలెక్టరేట్ ఎదుట నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాలురెడ్డిపల్లెకు చెందిన 100 దళిత కుటుంబాల వారు పక్కనే ఉన్న ఎర్రగుంటకోట పంచాయతీలోని సర్వేనంబరు 1155లో దాదాపు 200 ఎకరాల భూమిని దశాబ్దాలుగా సాగుచేసుకుంటూ వస్తున్నారన్నారు. సదరు ప్రభుత్వభూమిని తమకు పట్టాలుగా యివ్వా లని దళితులు ఎన్నిసార్లు అధికారులను వేడుకున్నా వారు పట్టించుకోలేదన్నారు. గత ప్రభుత్వంలో టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి ప్రైవేటు వ్యక్తుల పేరుతో తహసీల్దార్ ఆన్‌లైన్ చేశారన్నారు. అక్రమంగా ఆన్‌లైన్ చేసిన తహసీల్దార్‌పై కఠినచర్యలు తీసుకుని వెంటనే సస్పెండ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం జేసీ తమీమ్ అన్సారియాకు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో జిల్లా మహిళా సమాఖ్య నాయకురాలు సుమిత్రమ్మ, సీపీఐ చిట్వేలి కార్యదర్శి తిప్పన ప్రసాద్, డీహెచ్‌పీఎస్ నేతలు కుప్పం నరసింహులు, అంజయ్య, కటికం చంద్రతో పాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

నేతాజీ పోరాటం యువతకు ఆదర్శం

లక్కిరెడ్డిపల్లె : ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని విద్యాశాఖ కార్యాలయంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి కార్యక్రమాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ఎం.చక్రే నాయక్ పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నేతాజీ స్వాతంత్ర్య సమరంలో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా పోరాటం చేసి స్వాతంత్ర్యం సాధించడంలో ప్రముఖ పాత్ర వహించారని, ఏపీయూఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి నరసింహులు రెండో ప్రపంచ యుద్ధం సమయంలో యువకులకు స్వాతంత్ర్య భావాలు నింపి సైన్యాన్ని తయారు చేసి జైహింద్ నినాదం ఇచ్చిన మహనీయుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా ఇన్‌చార్జ్ కె వెంకటేశ్వర్లు, జిల్లా కార్యవర్గ సభ్యులు కె నరసింహులు, మండల కోశాధికారి మల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.



లక్కిరెడ్డిపల్లె: సుభాష్ చంద్రబోస్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న దృశ్యం

చిట్వేలిలో..



నివాళులర్పిస్తున్న ఎంఈఓ మహేశ్వరరావు తదితరులు

చిట్వేలి : స్థానిక ఎంఈఓ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో సుభాష్ చంద్రబోస్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఎంఈఓ మహేశ్వరరావు మాట్లాడుతూ భారత స్వాతంత్ర్యంలో ఆజాద్ హింద్ ఫౌజ్ సంస్థను స్థాపించి బ్రిటీష్ వారిని గడగడలాడించిన ధీరుడు సుభాష్ చంద్రబోస్ అని కొనియాడారు.

పెనగలూరులో...

పెనగలూరు : మండలంలో సుభాష్ చంద్రబోస్ 127వ జయంతి ఘనంగా నిర్వహించారు. నెహ్రూ యువకేంద్రం సహకారంతో వివేకానంద యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నేతాజీ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఈఓ జయవేలు మాట్లాడుతూ స్వాతంత్ర్య పోరాటంలో సుభాష్ చంద్రబోస్ పాత్ర అమోఘమైందన్నారు. నేతాజీ సాయుధ పోరాటంతోనే స్వాతంత్ర్యం సిద్ధిస్తుందని నమ్మి అజాద్ హింద్ ఫౌజ్‌ను ఆయన స్థాపించి బ్రిటీష్ వారిపై పోరాటం చేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.వి.సుబ్బారెడ్డి, వివేకానంద యూత్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కోడూరు మల్లికార్జున, యూత్ సభ్యులు లక్ష్మయ్య, నరసింహ, సతీష్ తదితరులు పాల్గొన్నారు.



పెనగలూరు: నివాళి అర్పిస్తున్న దృశ్యం

నెలనెల శ్రీహరి సంకీర్తన వెన్నెల

రాజంపేట రూరల్ : శ్రీ అన్నమాచార్య సంకీర్తన స్వర వాహిని చారిటబుల్ ఫౌండేషన్, ధర్మనిధి చారిటబుల్ ట్రస్ట్ సంయుక్తంగా శ్రీ వేంకటేశ్వరస్వామి జన్మనక్షత్రం సందర్భంగా అన్నమాచార్య సంకీర్తనతో నెలనెల వెన్నెల అనే సంగీత కార్యక్రమం ఆదివారం సాయంత్రం స్థానిక ఫ్యూచర్ మైండ్ స్కూల్‌లో ఆద్యంతం సమ్మోహనభరితంగా నిర్వహించారు. అలాగే ఆధ్యాత్మిక గాయకులు కోటపాటి గోవిందదాసచే అన్నమయ్య సంకీర్తన స్వరార్చన చేశారు. ఆకేపాటి శ్రావ్య కూచిపూడి నృత్యంతో అలరించింది.



నృత్యం చేస్తున్న శ్రావ్య

మూర్ఛ వ్యాధితో కూలీ మృతి

ఓబులవారిపల్లె : మండలంలోని గోవిందంపల్లె పంచాయతీలోని భరణి ఫల్వరైజింగ్ మిల్లులో శివయ్య (35) అనే కూలీ పని చేస్తుండగా మూర్ఛ రావడంతో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు చిట్వేలి మండలం కేఎస్ అగ్రహారానికి చెందిన మృతుడు భరణి ఫల్వరైజింగ్ మిల్లులో నెల రోజుల క్రితం కూలీ పనులకు చేరాడు. సంక్రాంతి పండుగ కారణంగా మిల్లులో పనులు లేని కారణంగా బయట పనులకు వెళ్లేవాడు. అదే విధంగా సోమవారం పనులు ముగించుకొని సాయంత్రం వచ్చి స్కూటర్ తీసుకునేందుకు వచ్చిన శివయ్య మూర్ఛ రావడంతో పక్కనే ఉన్న ట్రాలీలో పడి మృతి చెందాడు. ఇది గమనించిన చుట్టు పక్కల వారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. శివయ్యకు మూర్ఛ వ్యాధి ఉన్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలున్నారు. పోలీసులు విచారించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.